ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

పెద్దపల్లి, మార్చి 18(నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ కోరారు. పెద్దపల్లిలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు జే. అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌లతో కలిసి కలెక్టర్ ఎన్నికల నిర్వహణపై సోమవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదలవుతుందన్నారు. అదే నెల 18 నుంచి 25 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు. 26 వరకు నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందన్నారు. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందని వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాలో తుది ఓటరు జాబితా ప్రకారం 7,15,735మంది ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. 628 మంది సర్వీస్ ఓటర్లు, 53 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 1850 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 15,92,996 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. 1395 మంది సర్వీస్ ఓటర్లు, 102 మంది ఎన్ఆర్ఐ ఓటర్లు ఉన్నారని పేర్కొన్నారు. వయోజనులు ఓటరు జాబితాలో తమ పేరు చూసుకోవాలని, లేనివారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు 840 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఓటర్లకు రెండు కిలోమీటర్ల పరిధిలో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 2291 బ్యాలెట్, 1243 కంట్రోల్ యూనిట్లు, 1264 వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. షెడ్యూల్ ప్రకటించిన నాటి నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని చెప్పారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడడం, తప్పుడు ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాజకీయ పార్టీలు, నాయకులు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు మంజూరు చేస్తామని తెలిపారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందన్నారు. రాత్రి 10గంటల నుంచి ఉదయం 6గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని స్పష్టం చేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, పోలింగ్ కేంద్రాలకు 100మీటర్ల పరిధిలో రాజకీయ సమావేశాలు నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 20 సర్వేలెన్స్ బృందాలు, 21 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 14 వీడియో సర్వేలెన్స్ బృందాలు, 8 వీడియో వ్యూయింగ్ బృందాలు, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సీ-విజల్ యాప్ ద్వారా చేయవచ్చని తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదులు స్వీకరించేందుకు 24 గంటల పాటు కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. సీ-విజల్ యాప్‌లో లైవ్ వీడియో అప్ లోడ్ చేసిన వెంటనే గడువు లోగా అధికారులు క్షేత్రస్థాయికి చేరుకొని ఫిర్యాదుపై చర్యలు తీసుకుంటారని వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం -1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు.ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా రూ. 50వేలకు మించి నగదుతో ప్రయాణించవద్దన్నారు. ప్రతిరోజు తనిఖీల్లో జప్తు చేసిన సొమ్మును జిల్లాలో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పిస్తే గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

- ఎలక్షన్ కోడ్ ఉల్లంఘలపై ఫిర్యాదులకు 1950 టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఏర్పాటు
- సీ-విజిల్ యాప్‌లోనూ కంప్లయింట్ చేయవచ్చు
- కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జండర్	మొత్తం ఓటర్లు	ఎన్ఆర్ఐ	సర్వీస్‌ఓట్లు
రామగుండం	260	110255	109970	26	220251	21	213
మంథని	290	117271	121820	17	239108	10	155
పెద్దపల్లి	290	126404	129965	07	256376	22	260
మొత్తం	840	353930	361755	50	715735	53	628

పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని జగిత్యాల జిల్లా ఓటర్లు, పోలింగ్ కేంద్రాల వివరాలు

ధర్మపురి(ఎస్‌సీ)	269	111962	117647	6	229615	12	136

పెద్దపల్లి పార్లమెంట్ వివరాలు

నియోజకవర్గాలు	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	థర్డ్ జండర్	మొత్తం ఓటర్లు	ఎన్ఆర్ఐ	సర్వీస్‌ఓట్లు
7	1850	787140	805755	101	1592996	102	1395

ఎన్టీపీసీ ప్లాంటులో పర్యటిస్తున్న బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదనపు కార్యదర్శి విస్మితా తేజ్

ఎన్టీపీసీలో కోల్ సెక్రటరీ పర్యటన

జ్యోతినగర్, మార్చి 18: రామగుండం ఎన్టీపీసీలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదనపు కార్యదర్శి విస్మితా తేజ్ సోమవారం పర్యటించారు. మొదటగా తెలంగాణ ప్రాజెక్టులోని కంట్రోల్ గది, బాయిలర్‌ను సందర్శించారు. ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్‌లతో మాట్లాడి విద్యుదుత్పత్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రామగుండం ఎన్టీపీసీ ట్రాక్ హాపర్‌ను పరిశీలించారు. బొగ్గు నిర్వహణ, అన్‌లోడింగ్ సమస్యపై అధికారులతో చర్చించారు. అనంతరం ఎన్టీపీసీ రిజర్వాయర్‌లోని 100మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంటు సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎన్టీపీసీ పరిపాలన భవనంలో సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. బొగ్గు నిల్వలు, రవాణాకు సంబంధించిన వివరాలపై చర్చించారు. రవాణాకు ఎలాంటి అంతరాయం లేకుండా ఎన్టీపీసీ, సింగరేణి మరింతగా సహకరించుకోవాలని సూచించారు. టౌన్‌షిప్‌లోని వీఐపీ గెస్ట్ హౌస్ ఆవరణలో మొక్క నాటారు. ఇక్కడ సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎన్ వీకే శ్రీనివాస్, ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఎఫ్ఎం) ప్రదీప్ కుమార్ మిశ్రా, రామగుండం ఎన్టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్‌పాండు, జీఎంలు ఉన్నారు.

స్మార్ట్ ఫోన్లు వచ్చాకే నేరాలు పెరిగాయి

సైబర్ నేరాల తీరును వివరిస్తున్న సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

- మోసం జరిగితే 1930కి సమాచారం ఇవ్వండి
- సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి

కోల్‌సిటీ, మార్చి 18: స్మార్ట్ ఫోన్ల వినియోగంతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా జరుగుతున్నాయని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నేరగాళ్లు సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఇన్‌స్పెక్టర్ కృష్ణమూరి తెలిపారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌కు అపరిచితులు పంపే మెసేజ్‌లు, లింక్‌లు వచ్చినా, వాట్సాప్‌కు మెసేజ్‌లు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఒకవేళ సైబర్ నేరగాళ్ల ఉచ్చుకు చిక్కితే వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ వినియోగం పెరగడంతో సైబర్ మోసాలు కూడా పెరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ అట్టెం శంకర్, కానిస్టేబుళ్లు కుమార్, డీ శ్రీనివాస్, నిమ్మతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పరామర్శ

జ్యోతినగర్, మార్చి 18: ఎన్టీపీసీ బీఆర్ఎస్ రెండో డివిజన్ అధ్యక్షుడు సుద్దాల గోపాల్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ సోమవారం పరామర్శించారు. గోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఇక్కడ మున్సిపల్ కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగింపు

పెద్దపల్లిరూరల్, మార్చి 18: మైనార్టీ గురుకులాల్లో 5 వతరగతితో పాటు ఇంటర్ ఫస్టియర్, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి మహ్మద్ మెహరాజ్ మహ్మూద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల గడువును ఈ నెల 31 వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. 5 వతరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌తో పాటు, 6,7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు www. tmreis. telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు పెద్దపల్లి బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ 7331170848, పెద్దపల్లి బాలికల కళాశాల ప్రిన్సిపాల్ 9603313883, రామగుండం బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ 7331170845, రామగుండం బాలుర కళాశాల 9948978628, మంథని బాలకల పాఠశాల 7995057944, మంథని బాలికల కళాశాల 8096286629లలో సంప్రదించాలని సూచించారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షల నిర్వహణ

కాల్వశ్రీరాంపూర్ : పరీక్షకు హాజరైన విద్యార్థులు

పెద్దపల్లి , మార్చి18: జిల్లాలో 10వ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం టెన్త్ ఎగ్జామ్స్ ప్రారంభం కాగా, రంగంపల్లిలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష కేంద్రంలోకి ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో మొదటి రోజు పదవ తరగతి పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో డీ మాధవి తెలిపారు. జిల్లాలో 45 పరీక్షా కేంద్రాల్లో తెలుగు పరీక్షలో 7,725 విద్యార్థులకు గాను 7716 మంది విద్యార్థులు హాజరు కాగా, 99.9 శాతం హాజరు నమోదైందని వెల్లడించారు. 3 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 17 పరీక్షా కేంద్రాలు, డీఈవో 5 పరీక్షా కేంద్రాలను సందర్శించారన్నారు. తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు తెలిపారు.

మంథని, మార్చి 18: ఎస్సెస్సీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మంథనిలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రతీ సెంటర్‌లో ప్రశ్నపత్రాలను సీసీ కెమెరాల ముందు ఓపెన్ చేశారు. తొలి రోజు తెలుగు పరీక్షకు మొత్తం 516 మంది విద్యార్థులకు గాను 512 మంది హాజరయ్యారు.

ధర్మారం,మార్చి18 : మండలంలో ఐదు పరీక్ష కేంద్రాలకు గాను 743 మంది విద్యార్థులను కేటాయించారు. తొలిరోజు పరీక్షకు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో పీ ఛాయాదేవి తెలిపారు. ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫర్టిలైజర్‌సిటీ, జ్యోతినగర్, మార్చి 18: ఉమ్మడి రామగుండం నియోజకవర్గంలో మొదటి రోజు తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగింది. రామగుండం మండల కేంద్రంతో పాటు ఎన్టీపీసీ, గోదావరిఖనిలో దాదాపు 15 పరీక్షల కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎన్టీపీసీలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ పర్యవేక్షించింది.

జూలపల్లి, మార్చి 18 : జూలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో తరగతి వార్షిక పరీక్షలకు తొలి రోజు మొత్తం 262 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో కవిత తెలిపారు. సీఎస్ సదయ్య, డీవో సత్యం పరీక్ష కేంద్రాన్ని పర్యవేక్షించారు.

సుల్తానాబాద్, మార్చి 18 : సుల్తానాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. సుల్తానాబాద్‌తో పాటు గర్రెపల్లిలో ఏర్పాట్లు సెంటర్లలో మొత్తం 824 మందికి గాను 823 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు.

కాల్వశ్రీరాంపూర్, మార్చి 18: కాల్వశ్రీరాంపూర్ పరీక్ష కేంద్రంలో 200 మంది, కూనారం లో 35 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఎస్ఐ ఓంకార్ యాదవ్ ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కమాన్‌పూర్, మార్చి 18: కమాన్‌పూర్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రంలో మొదటి రోజు 132 మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ కొమురయ్య, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ అల్లం లూర్దూ మేరి తెలిపారు. వంద శాతం హాజరైనట్లు తెలిపారు.

ఓదెల, మార్చి 18: కొలనూర్, పొత్కపల్లి జడ్పీ, ఓదెల మోడల్ స్కూల్‌లలో పదో తరగతి పరీక్షలు నిర్వహించారు. తొలిరోజు 309 మంది విద్యార్థులకు గాను 308 హాజరైనట్లు అధికారులు తెలిపారు.

ముగిసిన ముర్మూర్ కొమురన్న జాతర

అంతర్గాం, మార్చి 18: ముర్మూర్‌లోని కొమురన్న మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం సందర్భంగా నిర్వహించిన జాతర సోమవారంతో ముగిసింది. భక్తులు అగ్నిగుండం నుంచి నడిచారు. చివరి రోజున పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. జాతరకు దాదాపు 30వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు నిర్వాహకుడు గోపు ఐలయ్య యాదవ్ తెలిపారు.

బాలరాజ్‌పల్లికి బస్సు వచ్చింది

జూలపల్లి, మార్చి 18 : బాలరాజ్‌పల్లి గ్రామస్తుల ఏండ్లనాటి కళ నెరవేరింది. ఆర్టీసీ గోదావరిఖని డిపో అధికారులు బస్సు సౌకర్యం కల్పించడంతో సంబరపడిపోతున్నారు. సోమవారం గ్రామానికి ఆర్టీసీ బస్సు చేరుకోవడంతో గ్రామస్తులు కొబ్బరికాయలు కొట్టి స్వాగతం పలికారు. ప్రతి రోజు గోదావరిఖని నుంచి పెద్దపల్లి, జూలపల్లి మీదుగా చొప్పదండికి వెళ్లి వచ్చే బస్సును అధికారులు బాలరాజ్‌పల్లి దాకా పొడిగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావుకు ఘూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, మాజీ చైర్మన్ గండు సంజీవ్, నాయకులు కోరుకంటి మల్లయ్య, గాగిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కొట్టె సంజీవ్, కుంటూరి లక్ష్మణ్, నలిగేటి సతీశ్, కోరుకంటి ఓదెలు, కొల్లూరి స్వామి కృతజ్ఞతలు తెలిపారు.

చేపలు పట్టడానికి వ్యవసాయ బావిలో దిగి..

ధర్మారం,మార్చి18: కొత్తూరు గ్రామంలో భూతగడ్డల నర్సింగం (35) వ్యవసాయ బావిలో చేపలు పట్టడానికి వెళ్లి దుర్మరణం చెందాడు. ఎస్ఐ టి సత్యనారాయణ, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నర్సింగం అతని భార్య రజితతో కలిసి సోమవారం గ్రామ శివారులో పొలం వద్దకు వెళ్లాడు. నర్సింగం సమీపాన ఉన్న సాగల నారాయణ వ్యవసాయ బావిలో చేపలు పట్టడానికి వెళ్లాడు. చేపలు పడుతున్న సమయంలో తూటి తీగ మెడకు చుట్టుకొని ఊపిరాడక మరణించాడు. భర్త ఎంతకూ రాకపోవడంతో బావి వద్దకు వెళ్లి చూడగా నర్సింగం చనిపోయి కనిపించడు. సమాచారం అందుకున్న ఎస్ఐ-2 అశ్విని గ్రామానికి వెళ్లి సంఘటన వివరాలు సేకరించారు. మృతదేహాన్ని బయటకు తీయించారు. పంచనామా అనంతరం డెడ్‌బాడీని పోస్టుమార్టం కోసం కరీంనగర్‌కు పంపించారు. నర్సింగం భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కాల్వశ్రీరాంపూర్, మార్చి18: మొట్లపల్లి కి చెందిన దొమ్మటి లక్ష్మయ్య(83) గంగారంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మయ్య సుల్తానాబాద్ మండలంలోని పెరకపల్లిలో తన బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి ఆదివారం వెళ్లాడు. తిరిగి తన కుమారుడు తిరుపతి తో కలిసి బైక్‌పై వస్తుండగా రాత్రి ఈ ప్రమాదం జరిగింది. లక్ష్మయ్య కొడుకు బైక్‌ను అజాగ్రత్తగా నడపడంతో వాహనం అదుపుతప్పి లక్ష్మయ్య కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతడిని కరీంనగర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఓంకార్‌యాదవ్ తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి గాయాలు

ఓదెల, మార్చి 18: బాయమ్మపల్లిలో పని చేస్తున్న విద్యుత్ సిబ్బంది బత్తుల శ్రీనివాస్‌కు కరెంట్ షాక్ తగిలి గాయాలు అయ్యాయి. వ్యవసాయ పొలాలకు విద్యుత్ సమస్య రావడంతో సరఫరాను నిలిపివేసి స్తంభం ఎక్కాడు.పైన ఉన్న 11కేవీ హైటెన్షన్ విద్యుత్ వల్ల ఇండేక్షన్ వచ్చి విద్యుత్ షాక్ రావడంతో స్తంభం పైనుంచి కింద పడగా తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే కరీంనగర్ దవాఖానకు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

మంథని మున్సిపల్ చైర్ పర్సన్‌గా రమ

మంథని, మార్చి 18: మంథని మున్సిపల్ చైర్ పర్సన్‌గా 13వ వార్డు కౌన్సిలర్ పెండ్రు రమ, వైస్ చైర్మన్‌గా 10వ వార్డు కౌన్సిలర్ శ్రీపతి బానయ్యను ఎన్నుకున్నారు. గతంలో మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌పై మెజార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టారు. అవిశ్వాసం నెగ్గడంతో వారు పదవులు కోల్పోయారు. ఆర్డీవో హనుమా నాయక్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన నూతన చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. అనంతరం చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌తో ఆర్డీవో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునస్వామి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేడు ఆయుర్వేద వైద్య శిబిరం

గోదావరిఖని, మార్చి 18: సింగరేణి ఆర్జీ-1 సేవా సమితి ఆధ్వర్యంలో మాతా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డాక్టర్ విశ్వనాథ మహర్షి మంగళవారం స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ తెలిపారు. శిబిరంలో అనారోగ్య సమస్యలు, చర్మ వ్యాధులు, మోకాళ్ల నొప్పులు, బీపీ, షుగర్, థైరాయిడ్, మలబద్ధకం, అజీర్ణం, పక్షవాతం, అస్తమా వంటి వ్యాధులకు ఆయుర్వేద మందులతో చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పెద్దపల్లి, మార్చి18: రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఏవో దోమ ఆదిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. వరి సాగుపై డాక్టర్ బీ శ్రీనివాస్ జగిత్యాల నుంచి సూచనలు అందిస్తారని, అనంతరం ఆయిల్ పామ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై డాక్టర్ రాజశేఖర్ కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి రైతులకు సలహాలు ఇస్తారని, డాక్టర్ కే కవిత వేసవిలో సాగు చేసే కూరగాయలు వాటిపై వాడే పురుగు మందు అవశేషాలపై రైతులకు వివరిస్తారని తెలిపారు.

ఒప్పంద ఉద్యోగాల నియామకాలపై విచారణ చేపట్టాలి

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 18: గోదావరిఖని లోని సింగరేణి మెడికల్ కళాశాల (సిమ్స్)లో ఒప్పంద ఉద్యోగ నియామకాల్లో అవకతవకలు జరిగాయని, విచారణ చేపట్టాలని ఒప్పంద ఉద్యోగ ఆఫీస్ సబార్డినేటర్ ఉద్యోగులు కే జ్ఞానశేఖర్, జే ఇంద్రజ సోమవారం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఏడాది డిసెంబర్ 23న నియామకాలపై మెరిట్ లిస్ట్ ప్రకారం ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. ప్రసుత్తం ఫైనల్ జాబితాను ప్రకటించకుండా అనర్హులను జాబితాలో చేర్చారని తెలిపారు. నిరుద్యోగులకు తీరని అన్యాయం జరుగుతున్నదని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

యైటింక్లయిన్ కాలనీ, మార్చి 18 : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి బ్రహ్మోత్సోవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన గురుస్వామి జగన్నాథా చార్యులు తెలిపారు. సోమవారం ఆలయంలో ఆయన మాట్లాడా రు. ఈనెల 19నుంచి 25 వరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఉంటాయని తెలిపారు. వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం బ్రహ్మోత్సవాల పోస్టర్ విడుదల చేశారు. రాధాకృష్ణ, భానుచార్యులు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్యశిబిరం

ధర్మారం,మార్చి18: నంది మేడారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో లంబాడి తండా (బీ)లోసోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ గౌతం 82మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. నంది మేడారం పీహెచ్ సీలో లెప్రసీ డాక్టర్ జయప్రకాశ్ 21 మందికి వైద్య పరీక్షలు చేశారు. వ్యాధి లక్షణాలు ఉన్న వారికి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సుస్మిత, పీహెచ్ఎన్ విజయలలిత, హెల్త్ సూపర్‌వైజర్లు జయ, జీవరాణి, మలేరియా నోడల్ పర్సన్ హెల్త్ అసిస్టెంట్ దామోదర్, ఏఎన్ఎమ్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కమాన్‌పూర్, మార్చి 18: కమాన్‌పూర్ ఎంపీడీవోగా కొప్పుల శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పని చేసిన విజయ్‌కుమార్ కరీంనగర్‌కు బదిలీ కాగా, ఆయన స్థానంలో రామగిరి మండల పర్యవేక్షకుడు ఉమేశ్‌ను ఇన్‌చార్జి ఎంపీడీవోగా నియమించారు. మంథని ఎంపీడీవోగా ఉన్న శ్రీనివాస్‌ను కమాన్‌పూర్‌కు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. నూతన ఎంపీడీవోకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

చలివేంద్రాల ప్రారంభం

ముత్తారం, మార్చి18: పారుపల్లిలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో ఇనుముల ప్రదీప్ ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఇనుముల సాగర్, సంగే సంజీవ్, తగరపు వేణు ప్రసాద్, జీ నవీన్, మేకలకుమార్ పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

రామగిరి, మార్చి 18: బేగంపేట శివారులోని గుట్ట ప్రాంతంలో పేకాట స్థావరంపై ఎస్ఐ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి దాడి చేశారు. పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. వారి నుంచి రూ.93,950 స్వాధీనం చేసుకున్నారు.

దళితుల హక్కులకు భంగం కలిగితే సహించం

గోదావరిఖని, మార్చి 18: దళితుల హక్కులు, జీవన స్థితిగతులకు ఏ మాత్రం ఆటంకం కలిగించినా, ఇబ్బందులకు గురిచేసినా సహించేది లేదని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రాంచందర్ అన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు రాంచందర్‌ను గోదావరిఖనిలో సిం